ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



## (గుండుగొలనులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 21-8-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు సర్వజ్ఞుడు అన్నీ, శక్తివంతుడు అని, మనకంటే ఉన్నతుడు అని, ఆయన చేతులలో మనం ఉన్నామనీ మనకి తెలియకపోవటం వలన మనకు అజ్ఞానం కలుగుతోంది, అహంకారము కలుగుతోంది. భగవంతుని ఔన్నత్యమును శ్రవణం చేస్తుంటే, భగవంతుని గురించి తెలుసుకొంటే మన సాధనతో పనిలేకుండా కురుపుపెచ్చు రాలినట్లుగా అజ్ఞానం రాలిపోతుంది. మన శరీరం మరణించిన మరణం లేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది. అది ఒక్కటే నిజం. దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయండి. భక్తి మార్గంలోగాని, జ్ఞాన మార్గంలోగాని, కర్మ మార్గంలోగాని మీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చేసి మీ హృదయంలో ఉన్న సత్యవస్తువును తెలుసుకోండి. సూర్యుడు ఏవిధంగా చీకటిని చూడలేడో అలాగే మీ హృదయంలో ఉన్న సత్యవస్తువును తెలుసుకొంటే మీకు దు:ఖం కనబడదు. మీశరీరం చనిపోతున్నా మనం ఏదో అయిపోతున్నాము అని మీకు అనిపించదు. అజ్ఞాని ఈ దేహంతో ఎలా తాదాప్యం పొందుతాడో అలాగ జ్ఞాని లోపల ఉన్న సత్యవస్తువుతో తాదాప్యం పొంది ఉంటాడు. దానికి మరణం లేదు అన్న సంగతి వాడికి తెలుసుకాబట్టి వాడికి కూడా మరణం లేదు అని తెలుస్తూ ఉంటుంది.

మీ ఇంద్రియాలను, మనస్సును అదుపులో పెట్టుకొంటే 50 శాతము ఈశ్వరత్వము వచ్చేస్తుంది. కొంతమంది భౌతికంగా ఏదైనా కష్టాలు వచ్చినా క్రమశిక్షణ వదిలి పెట్టరు. కొంతమంది భౌతికజీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి సంబంధంలేదు అని అనుకొంటారు ఇది తప్పు. మీరు భౌతిక జీవితంలో క్రమశిక్షణగా ఉంటే దైవానుగ్రహానికి పాత్రులవుతారు. ఏదో కాఫీ త్రాగటానికి, తినటానికి, తిరగటానికి మనం ఈ భూమి మీదకు రాలేదు. శిక్షణ పొందటానికే మనం ఈ భూమి మీదకు వచ్చాము. దేహప్రారబ్ధమునుబట్టి మన జీవితంలో ఏ సంఘటన ఎదురైనప్పటికీ దానితో కలిసిపోకుండా మంచివస్తే పొంగిపోకుండా, చెడ్డవస్తే కృంగిపోకుండా సమానంగా ఉండగలిగితే 50 శాతము ఈశ్వరత్వము వస్తుంది.

జ్ఞానమార్గము, కర్మమార్గము, భక్తి మార్గముల గురించి భగవాన్ చాలా సింపుల్‌గా చెప్పారు. నువ్వు ఏదైతే అవును అనుకొంటున్నావో అది కాదని తెలుసుకోవటమే జ్ఞానమార్గము. ఈ దేహము, మనస్సు, తెలివి నీవు కాదు అని తెలుసుకోవటమే జ్ఞానమార్గము. నీ దేహం ఎక్కడ ఉందో నీమనస్సు కూడా అక్కడ ఉండాలి. నీవు ఏ పని అయితే చేస్తున్నావో దానిని శ్రద్ధగా, నిష్టగా, కృష్ణార్పణంగా చేయాలి. అలాగ చేస్తూ ఉంటే నీవు చేసేపని మీద నీ మనస్సును నిలబెడితే నీకు తెలియకుండా నీమనస్సు అణిగిపోతుంది. అది కర్మమార్గము. నీకు ఏ దేవుడు అయితే ఇష్టమో ఆరూపాన్ని ధ్యానం చేయగా చేయగా, ఆనామాన్ని స్మరించగా, స్మరించగా మీకు తెలియకుండా మీమనస్సు రాలిపోతుంది. అది భక్తి మార్గము. భక్తి మార్గము, కర్మమార్గము, జ్ఞానమార్గములలో నీవు

పోగొట్టుకోవలసింది మనస్సునే. మనస్సు అనే తెరను తీసివేస్తే దానిని చింపివేస్తే ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమయ్యేవరకు లేని వస్తువు ఉన్న దానివలె మనకు కనబడుతుంది.

ఒక భక్తుడు భగవాన్‌తో చెపుతున్నాడు. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకొంటున్నాను. ఏదో నేను చేసే ప్రయత్నం చేస్తున్నాను. నాయోగ క్షేమములు మీరు చూడాలి. మీరు పొందినస్థితి నేను కూడా పొందేటట్లు మీరు చేయాలి. ఏదో ప్రయత్నం చేసుకొంటున్నాను అని నన్ను వదిలిపెట్టవద్దు. మీ అనుగ్రహం కావాలి. మీ అనుగ్రహం లేకుండా జ్ఞానస్థితిని పొందలేను అని భగవాన్‌తో చెపుతున్నాడు. అప్పడు భగవాన్ చెపుతున్నారు నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకొంటున్నాను, మీరు నాకు జ్ఞాపకం లోనికి వస్తున్నారు అని చెపుతున్నావు కదా ఆజ్ఞాపకం పెట్టుకోవటం అనేది నీ అహంకారమువలన, నీ మనస్సు వలన నువ్వు జ్ఞాపకం పెట్టుకోవటం లేదు. నువ్వు ఈశ్వరుని జ్ఞాపకం పెట్టుకుంటున్నావు అంటే అది ఈశ్వరానుగ్రహంవలననే, గురువు అనుగ్రహం వలననే జ్ఞాపకం పెట్టుకొంటున్నావు కాని నా తెలివి తేటలవలన ఈశ్వరుని జ్ఞాపకం పెట్టుకొంటున్నాను అని అనుకోవద్దు. నా అనుగ్రహం కావాలి అంటున్నావు నా అనుగ్రహమే లేకపోతే నా జ్ఞాపకమే నీకురాదు అంటున్నారు. నా అనుగ్రహం కావాలి అని నీవు ప్రత్యేకం అడుగనక్కరలేదు.

చైతన్యం, ఆత్మ, గురువు, ఈశ్వరుడు ఇవి అన్నీ ఒక్కటే. పేర్లు తేడాగాని ఉన్నది ఒక్కటే. నీ కంట్రోలర్ నీ హృదయంలోనే ఉన్నాడు. వాడు నీలోపల ఉండి కెలకటం వలన, ప్రేరణ కలగజేయటం వలన వాడిని జ్ఞాపకం పెట్టుకొంటున్నావు. వాడి కరుణ, దయ, ప్రేమ, అనుగ్రహం నీకు లేకపోతే వాడు జ్ఞాపకం రాడు. అనుగ్రహం ఎప్పడూ పనిచేస్తుంది. అది లేని క్షణం అంటూలేదు. ఒకోసారి నీవు అనుకొన్నపని తేలికగా అయిపోతుంది. ఒకోసారి తేలికగా అవ్వదు. అది తేలికగా అవ్వకపోవటానికి కారణం దాని ద్వారా నీ మనస్సులో ఉన్న బలహీనతలను బయటకు లాగి కాల్చటానికి ఈశ్వరుడు ఆడుతున్న ఆట. అంతేగాని నీ మీద ఆయనకు ఇష్టంలేక కాదు. జరిగేది ఈశ్వర సంకల్పము. అనుకొనేది మానవ సంకల్పము. దేవుని అనుగ్రహం లేకుండా కేవలము నీ తెలివితేటలవలన దేవుని స్మరించుకొంటున్నాను అనుకోవద్దు. ఇలా అనుకొంటూ ప్రమాదంలో పడవద్దు. బహుజాగ్రత్తగా ఉండాలి. నువ్వు నన్ను తలపెట్టుకొంటున్నాను అని చెపుతున్నావు కదా అది నీలోపల జరిగే ప్రతిస్పందన. అదే ప్రేరణ, అదే ఆత్మ, అదే అనుగ్రహం, అదే ఈశ్వరుడు. మనం నెమ్మదిగా ప్రయాణం చేసినా, స్పీడుగా ప్రయాణం చేసినా మార్గము సక్రమమైనది అయితే గమ్యం చేరతాము. నీవు దేనినైతే పొందాలో దానిని పొందటానికి నీమార్గం అనుగుణంగా ఉందో, లేదో చూసుకో. నీవు ప్రతీ చిన్న విషయానికీ, ప్రతీ చిన్న సంఘటనకు రియాక్టు అవుతూ ఉంటే నీ సాధన సరియైన మార్గంలో లేనట్లు అని స్వామి శివానంద చెప్పారు. నీవు సరియైన మార్గంలో ఉంటే ఎవరైనా నిన్నునిందించినా, అవమానపరచినా దానిని సహించే శక్తి నీకు ఉండాలి. నీలోపల ఉన్న సత్యాన్ని తెలుసుకోవాలనే కోరిక కూడా ఈశ్వరానుగ్రహం వలననే వస్తోంది. నీ తెలివితేటల వలన వస్తోంది అని నీవు అనుకోవచ్చు. ఎందుచేతనంటే ఈశ్వరుడు అంటే ఏమిటో నీకు తెలియటంలేదు. ఆయన గురించి, ఆయన ఔన్నత్యం గురించి నీకు సమగ్రంగా తెలిస్తే నీ పొగరుబోతు తనం దానంతట అదే పోతుంది. ఈశ్వరుని కృప ఎప్పడైతే నీకు కలిగిందో అప్పడు ఈశ్వరుడే నీకు ఆత్మగా ప్రకాశిస్తాడు. అప్పడు నీకు మరణభయం ఉండదు. ఆత్మానుభవం కలగటానికి, మోక్ష సామ్రాజ్యానికి అధిపతి అవ్వటానికి

భయమే మనకు అడ్డు వస్తోంది. ప్రతీ మనిషికి భయం ఎక్కువ. మన ఇష్టాయిష్టములకంటే కూడా పొందవలసిన వస్తువును పొందకుండా భయమే మనకు ఎక్కువ అడ్డువస్తోంది. పరిశీలన చేసుకొంటే మనకు తెలుస్తుంది.

నీవు సిన్సియర్‌గా ప్రయత్నం చేస్తూ ఉంటే నీవు ఏదేవుడు కోసం వెతుకుచున్నావో ఆయనే నీ హృదయంలో చైతన్యముగా ప్రకాశిస్తాడు. దేవుడు ఎక్కడో వైకుంఠములో ఉన్నాడు అని నీవు అనుకొంటున్నావు. వైకుంఠములో ఉన్న నారాయణుడే నీకు అతి దగ్గరగా నీ హృదయంలో ఆత్మగా ప్రకాశిస్తాడు. అది ఆయన అనుగ్రహం. ఈశ్వరుని ప్రార్థించగా, ప్రార్థించగా నీలోని బలహీనతలు అన్నీ కాలిపోతాయి. అప్పుడు ఈశ్వరుడే నీహృదయంలో ఆత్మగా, చైతన్యముగా దర్శనమిస్తాడు. సత్యమైన నేనుగా నీ హృదయంలో ప్రకాశిస్తాడు. లోపల నుండి ప్రేరణ ఇస్తాడు. నన్ను తెలుసుకో సుఖపడతావు. ఇలా బొమ్మలతో ఎంతకాలం తిరుగుతావు. నన్ను తెలుసుకో నీవు మోక్ష సామ్రాజ్యానికి అధిపతి అవుతావు అని లోపల నుండి పిలుస్తూ ఉంటాడు. నీవు ఏమిచేయాలి అంటే ఆయనకోసం ఒక్క అడుగు వేస్తే ఆయన నీకోసం తొమ్మిది అడుగులు వేసి ముందుకు వస్తాడు.

నిన్ను ఎక్కడైతే గౌరవిస్తున్నారో అక్కడికి వెళితే నీ అహంకారము గురించి తెలియదు. నిన్ను ఎక్కడైతే అగౌరవపరుస్తున్నారో ఒకోసారి అక్కడకు వెళుతూఉండు. అప్పుడు నీ అహంకారము యొక్క బలం ఎంత ఉందోనీకు తెలుస్తుంది. ఒకోసారి ఈశ్వరుడు మిమ్మల్ని తలుపుసందున పెట్టినొక్కుతూ ఉంటాడు అంటే కష్టాలను పంపిస్తూ ఉంటాడు ఏమిటి భగవంతుడు ఇలా చేస్తున్నాడు. అనుకోవద్దు. అలా చేయటంద్వారా మీలోని బలహీనతలను కక్కిస్తాడు. ఒకోసారి ఇంటిలోని వారు అంతా విరోధులు అయిపోతారు. అప్పుడు నీకు మానసికబలం పెరుగుతుంది. నీకు మానసికంగా ఎంతబలం ఉంది, ఏకాంత జీవితానికి నువ్వు ఎంతవరకూ నిలబడగలవు అని ఈశ్వరుడు పరీక్ష చేస్తాడు. ఈశ్వరుని కోపంకూడా ఈశ్వరుని అనుగ్రహమే అని ఎవరైతే భావిస్తున్నారో వారు ధన్యులు. నీవు సిన్సియర్‌గా ప్రయత్నం చేస్తూ ఉంటే లోపల కదలిక పుడుతుంది. రాబోయే జన్మకు హేతువులు నీ మనస్సులోనికి వస్తాయి. అప్పుడు మీకు భయం కలుగుతుంది. మీరు కంగారుపడనక్కరలేదు. మీలో రాబోయేజన్మకి కారణాలు ఏవైతే ఉన్నాయో మీకు తెలియకుండా వాటిని బయటకు తీయటానికి అవకాశంలేదు. అందువలన వాటిని మీకు తెలియజేస్తాడు. అప్పుడు కంగారుపడకుండా ఈశ్వరుని మీద భారంవేసి నిర్మలంగా ఉండగలిగితే వాటిని కక్కిస్తాడు. ఒక జన్మలో అనుభవించవలసిన బాధను కొన్ని క్షణాలలో మీచేత అనుభవింపజేసి తీసేస్తాడు వాడు గురువు. నేను బాగా సాధన చేస్తున్నాను. శాస్త్రీయంగా చేస్తున్నాను, శ్రద్ధగా చేస్తున్నాను అని ఒక భక్తుడు భగవాన్‌తో చెపితే సాధనలో ఏమీలేదు అని నీకు తెలిసేవరకూ సాధన మానవద్దు అని చెప్పారట. దాని అర్థం ఏమిటి అంటే సాధన చెయ్యి, కేవలము సాధన వలన జ్ఞానంరాదు. ఈశ్వరునుగ్రహం వలన మాత్రమే జ్ఞానం వస్తుంది. ఈశ్వరునుగ్రహం లేకుండా మనం ఈశ్వరుని పొందలేము.

నీప్రయత్నంవలననే ఆత్మసాక్షాత్కరము కలుగుతుంది, మోక్షసామ్రాజ్యానికి అధిపతివి అవుతావు అని అనుకోవద్దు. నీకు మనస్సు ఉంది కాబట్టి ప్రయత్నం చెయ్యి. ప్రయత్నం చేయకుండా ఉండలేవు కాబట్టి ప్రయత్నం చెయ్యి. నీవు ఏది పొందినా అది దైవానుగ్రహమే, నీ తెలివితేటల వలనకాదు. ఎక్కడైతే మనస్సు అణిగిందో అక్కడ ఈశ్వరుడు వ్యక్తమవుతాడు. నీమనస్సు అణగకుండా ఎవరైనా అవతారపురుషుడు దర్శనం ఇచ్చినా అది మానసిక దృశ్యము మాత్రమే. అదిపారమార్థిక సత్యంకాదు.

మన శరీరం చనిపోవటానికి 100 రోగాలు అక్కరలేదు, ఒక్కరోగం చాలు పీడించి పీడించి చంపేస్తుంది. అదే విధంగా పునర్జన్మకు అనేక వాసనలు అక్కరలేదు. నీలో ఒక్క బలహీనత ఉన్నా చాలు అది నిన్ను తిరిగి ఈభూమి మీదకు తీసుకొని వచ్చేస్తుంది.

మనందరకు ముసలితనం అంటే ఇష్టం ఉండదు. చావు అంటే ఇష్టం ఉండదు. పుట్టటం అంటే ఇష్టం. కానిపుడితే ముసలితనం వస్తుంది, చావు వస్తుంది అని దూరం ఆలోచించే శక్తి మనకులేదు. పుట్టటం అంటే ఎందుకు ఇష్టం అంటే పుడితే మనం ఎక్కడో చోట ఉండవచ్చును అని మనం అనుకొంటున్నాము. సరిఅయిన అవగాహన లేకపోవటం వలన ఇలా అనుకొంటున్నాము. దేహానికి, ఉండటానికి మనకు సంబంధం లేదు. దేహం లేకపోయినా మనం ఉంటాము అని తెలియకపోవటం వలన దేహం పోయినపుడు బాధవస్తుంది. శరీరం చనిపోయేటప్పుడు మనకు భయం కలుగుతుంది. శరీరం చనిపోయిన తరువాత కూడా మనంఉంటాము అని మనకు తెలిస్తే ఇంక భయం కలుగదు. ఎంతో కొంత ప్రయత్నం సిన్సియర్‌గా చెయ్యి. అలా చేస్తే నిన్ను మోక్ష సామ్రాజ్యానికి అధిపతిని చేస్తాడు. ఈశ్వరానుగ్రహం వస్తున్నప్పుడు నీవైపు నుండి కొంచంకూడా ప్రయత్నం చేయకపోతే అనుగ్రహం నీ మీద ప్రోపర్‌గా పనిచేయదు. మీరు చేసే ప్రయత్నంచిన్నది అయినా శ్రద్ధగా చెయ్యి, ప్రేమగా చెయ్యి ఈశ్వరానుగ్రహానికి పాత్రుడువుఅవుతావు. నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే ఈశ్వరానుగ్రహం వలన వస్తువును పొందుతావు.

భగవాన్ కంటే పూర్వం అరుణాచలంలో ఒక ఋషి ఉండేవారు. ఒక వర్తకుడు రోజు ఆయన దగ్గరకు వెళ్ళి కూర్చొనేవాడు. కొంతకాలం తరువాత ఆ వర్తకుడు ఋషితో ఈనేను నాకు పోలేదు. కాని ఇది ఇంతవరకు నాశవం గురించి. బట్టగురించి, పొట్ట గురించి ఆలోచించేది. కాని ఇప్పుడు ఇది మీ గురించి ఆలోచిస్తోంది అని చెప్పాడట. అదిచాలు అన్నారట ఆ ఋషి. నేను ఉన్నమాట నిజమే కాని అది దేహం గురించి, దేహానికి సంబంధించిన విషయముల గురించి ఆలోచించటంలేదు నా గురించి ఆలోచిస్తోంది అని చెపుతున్నావు. అలా ఆలోచించి, ఆలోచించి అదే చనిపోతుంది అని చెప్పారట.

మేము జపం చేస్తున్నాము అని భగవాన్‌తో చెపితే జపం చేసుకోండి మంచిదే కాని జపం చేయుటానికి లోపల ఒకడు ఉండాలికదా వాడు ఎవడో చూడండి అనేవారట. దీపాలవంక చూస్తున్నాము అని ఎవరైనా భగవాన్‌తో అంటే ఆ చూసేవాడు ఎవరు అనేవారు. అసలు నేరస్థుడువాడు, వాడిని పట్టుకోండి అని చెప్పేవారు. నీకు చాలతలంపులు ఉండవచ్చు. చావు ఒక తలంపు, పుట్టుక ఒక తలంపు, పుణ్యం ఒక తలంపు, పాపం ఒక తలంపు. ఈతలంపులు అన్నింటికి ఒక తొలి తలంపు ఉంది. ఆ తొలితలంపు మూలం తెలిసేవరకూ నీవు కోటిజన్మలు ఎత్తినా నీకు ఈశ్వరసాక్షాత్కారము కలుగదు. ఇక్కడ రాజీపడటానికి ఆస్కారము లేదు. వైకుంఠములో దేవుడు ఉన్నాడు అని నీవు అనుకోవచ్చును. అరుణాచలంలో దేవుడు ఉన్నాడు అని నీవు అనుకోవచ్చును. నీ మనస్సు ఎంత నిజమో ఆ దేవుళ్ళు కూడా అంతే నిజం. Subject దగ్గరకు వచ్చేటప్పటికి భగవాన్ రాజీపడరు. మిమ్మల్ని బాధపెట్టాలి అనికాదు. మిమ్మల్ని సత్యము దగ్గరకు తీసుకొని పోవటానికి చూస్తాడు. ఎందుచేతనంలే సత్యము మీకు తెలిస్తే గాని మీకు స్వేచ్ఛలేదు, శాంతిలేదు, ఆనందంలేదు.

**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 23-9-97)**